# నీట్ పరీక్షకు ప్రవేశ పరీక్షకు అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలి.

### పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి .

**నల్లగొండ ,మే 3 ,మన సాక్షి**



నీట్ ప్రవేశ పరీక్షకు అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.శనివారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రం, అలాగే మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ తో కలిసి తనిఖీ చేశారు.ముందుగా జిల్లా కేంద్రంలోని రామగిరి లో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ సౌకర్యాలను, బందోబస్తు ఏర్పాట్లను తనిఖీ చేశారు. అనంతరం ఎంజి యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు .కాగా నీట్ అండర్ గ్రాడ్యుయేట్ -2025 ప్రవేశ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 7 కేంద్రాలు నల్గొండ జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో 4 పరీక్ష కేంద్రాలు, ఎన్జీ కళాశాలలో ఒకటి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఒకటి, కేంద్రీయ విద్యాలయలో మరొక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మొత్తం 2087 మంది అభ్యర్థులు నీట్ ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణలో భాగంగా పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లను ఆమె తనిఖీ చేయడమే కాక పరీక్ష కేంద్రాల సూపరింటిండెంట్లు,నోడల్ అధికారి, సంబంధిత శాఖల అధికారులకు మరోసారి ఆదేశాలు జారీ చేశారు. పరీక్షరాసే అభ్యర్థులు ఉదయం 11 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆమె కోరారు. మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్ష కేంద్రం ప్రధాన గేట్లను మూసివేయడం జరుగుతుందని పునరుద్ధరించారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రంలో మౌలిక వసతులు అన్నింటిని
మరోసారి పరిశీలించుకోవాలని ముఖ్యంగా తాగు నీరు, విద్యుత్, ఫ్యాన్లు, మెడికల్ సౌకర్యాలు ,తదితర అన్నింటిని పునః పరిశీలించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ చంద్ర పవర్ ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ రాజ్ కుమార్, అడిషనల్ ఎస్పీ రమేష్, నల్గొండ ఆర్డీవో వై .అశోక్ రెడ్డి, డిఎస్పి శివరాం రెడ్డి ,నీట్ నోడల్ ఆఫీసర్ ,కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ,తదితరులు ఉన్నారు.



# ధరలు లేక దిగాలు చెందుతున్న టమోటా, మామిడి రైతన్నలు

**రామసముద్రం మే 3 మనసాక్షి**

అన్నమయ్య జిల్లా మండలంలోని టమోటా పంట రైతులకు ధరలు లేక గత 15రోజులుగా తగ్గుముఖం పడుతుండడంతో టమోటా పంట పండించిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. శనివారం బజారులో బాక్స్ 50-60 ధర పలికింది. దిగుబడి తక్కువగా ఉన్న ధరలు పెరగడం లేదంటూ రైతులు వాపోతున్నారు. బయట ప్రాంతాల్లో టమోటా కు డిమాండ్ లేక పోవడం వల్ల ధరలు పెరగడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతు లకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. ప్రకృతిని నమ్ముకుని భూమి పై ఆధారపడి ఒక పంట పోతే మరో పంట వస్తుందన్న ఆశతో టమోటా పంట వేసి దిగుబడి బాగా వచ్చినా పంటకు గిట్టుబాటు ధర లేదు. పంట కోసం అప్పులు తీర్చలేక అప్పులు పాలైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.అలాగే శుక్రవారం పడిన అకాల వర్షం, ఈదురుగాలులకు నేలరాలిన మామిడి కాయలు ప్రకృతి వైపరీత్యాలతో మామిడి రైతు కుదేలు



అవుతున్నాడు. ఈదురు గాలులతో కూడిన అకాల వర్షంతో రైతులు ఆశలు నేలరాలుతున్నాయి.పూత దశలో మామిడి పంటకు వ్యాపించిన చీడ పీడల వల్ల దిగుబడి తగ్గి దిగాలతో ఉన్న రైతులకు అకాల వర్షంపడడంతో దిక్కుతోచని పరిస్థితి రైతులు ఎదుర్కొంటున్నారు. ఈదురు గాలులు అకాల వర్షంకురవడంతో ప్రకృతి ప్రకోపానికి మామిడి రైతులు విలవిలాడిపోతున్నారు. పంట నష్టాన్ని అంచనావేసి ప్రభుత్వం ఆదుకోవాలని మామిడి రైతులు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

# అర్వపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ గా రాజేందర్ రెడ్డి

**అర్వపల్లి మే 3 మన సాక్షి**



మండల కేంద్రంలో చారిత్రాత్మక, స్వయంభు యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన పాలక మండలి శనివారం దేవాలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం నిర్వహించారు.
దేవస్థానం చైర్మన్ గా మండల కేంద్రానికి చెందిన అని రెడ్డి రాజేందర్ రెడ్డి ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా బీ రవోలు శ్రీధర్ రెడ్డి, జేరిపోతుల సోమయ్య గౌడ్, ఆకుల సోమయ్య ప్రమాణ స్వీకారం చేశారు, దేవస్థానం ఉమ్మడి జిల్లా ఇన్స్పెక్టర్ శ్రీమతి సుమతి, శ్రీనివాసమూర్తి, ఆధ్వర్యంలో అర్చకులు రాంబాబు చార్యులు యోగనంద దీక్షితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన దేవాలయానికి చైర్మన్గా ఎన్నికవ్వడం తన పూర్వజన్మ సుకృతం అని అన్నారు. దేవాలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తన ఎన్నికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ధరూరి యోగానంద చార్యులు మాట్లాడుతూ, లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎంపీ, ఎమ్మెల్సీ, మంత్రుల, కార్పొరేషన్ చైర్మన్ సహకారంతో దేవాలయాన్ని అని రంగాలలో అభివృద్ధి చేస్తామని అన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బోయినపల్లి రేఖ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తిరుమలగిరి మండలం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండెపురి రాజయ్య, గూడుపు నాగరాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నారగోని అంజయ్య గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారపాక సత్యం, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, సిగ నజీర్ గౌడ్, మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు బుర్ర గిరిబాబు కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ కృష్ణమూర్తి, బొల్లం సైదులు, కుంభం సురేష్, తిమ్మాపురం
గ్రామ శాఖ అధ్యక్షుడు వేములకొండ ఉప్పలయ్య గౌడ్, సీనియర్ నాయకుడు రత్నం సంతోష్, బింగి కృష్ణమూర్తి, రమావత్ లాల్ నాయక్, మద్దీ పద్మ పాల్గొన్నారు

# కంగ్టి బీజేపీ మండల అధ్యక్షుడిగా సచిన్ స్వామి

**కంగ్టి, మే 03, మన సాక్షి :-**



సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం బీజేపీ నూతన అధ్యక్షుడిగా సచిన్ స్వామిను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మండల కేంద్రానికి చెందిన సచిన్ స్వామి గత కొంత కాలంలో పార్టీలో చురుకుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షురాలికి ధన్యవాదాలు తెలిపారు. బాధ్యతతో పార్టీని ముందుకు నడిపిస్తానని చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన పెద్దలకు మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి విజయ్ పాల్ రెడ్డి, జనవాడే సంగప్ప పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సిద్ధం చేస్తానని పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని సతీష్ స్వామి పేర్కొన్నారు.

# డి కొత్తపల్లి పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం

**అర్వపల్లి మే 3 మన సాక్షి**



డి కొత్తపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ ప్రారంభించారు. నెల రోజులపాటు నిర్వహించే ఈ శిబిరంలో తెలుగు ఆంగ్లము గణితం సబ్జెక్టులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకి తెలిపారు. గ్రామము మరియు పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న ఎవరైనా ఈ శిబిరాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు అందరూ కూడా పాఠశాలకు హాజరైతారని తెలిపారు. కొత్తపల్లి శివారు ప్రాంతం, నుండి వచ్చే విద్యార్థులకు విద్యా సంవత్సరం పూర్తి అయ్యేంతవరకు ఆటో చార్జీలు ప్రధానోపాధ్యాయురాలు స్వచ్ఛందంగా చెల్లిస్తానని అన్నారు. పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# తడ్కల్‌లో జొన్నల తూకం ప్రారంభం

**కంగ్టి, మే 03, మన సాక్షి :-**



సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల తడ్కల్ గ్రామంలో శనివారం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జోన్నల కొనుగోలు కేంద్రంలో శనివారం జొన్నల తూకం ప్రారంభించారు.ఈ సందర్భంగా సొసైటీ నిర్వాహకులు మాట్లాడుతూ.. రైతులు జొన్నల టోకెన్ ఇచ్చిన రోజు జొన్నలు తడ్కల్ జడ్పిహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు రమేష్ , సొసైటీ సిబ్బంది రైతులు ఉన్నారు.

# రైతును విస్మరించిన కాంగ్రెస్

### కాంగ్రెస్‌పై భ్రమలు తొలగి పోయాయి

నిజామాబాద్: వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు ఉచితంగా ఎరువులు ఇవ్వడంలేదు. రుణమాఫీ సరిగా చేయలేదు. కనీస మద్దతు ధరకు పంటల కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని శనివారం నాడిక్కడ తనను కలిసిన మీడియా మిత్రులతో అన్నారు. ఇందులో భాజపా పాత్ర కూడా ఉందని ఆరోపించారు. తెలంగాణ సమాజానికి కాంగ్రెస్ పాలన ప్రమాదకరంగా మారిందని, ఈ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చిందని అన్నారు. అన్నదాతలకు బిఆర్ఎస్, కెసిఆర్ ఎప్పుడూ అండగా నిలిచిందని అన్నారు. తెలంగాణ ఏర్పాటు వల్ల రైతులు, వారి కుటుంబాలు బాగుపడ్డాయని అన్నారు. ఒక్కకెసిఆర్ మాత్రమే రైతులకు మేలు చేయగలరని ప్రజలకు కూడా తెలిసిపోయిందని అన్నారు. రైతుల్ని ఆత్మగౌరవంతో బతికేలా చేయాల్సిన ప్రభుత్వం దాన్ని విస్మరించి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులను కల్పిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో 70 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధార పడ్డారు. అది ప్రమాదం అంచున ఉంది. వ్యవసాయాన్ని కాపాడు కోవడం ద్వారా తెలంగాణ సమాజాన్ని కాపాడాలనే లక్ష్యంతో కెసిఆర్ అనేక కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. రైతు ఆత్మగౌరవంతో బతికేందుకు కావాల్సిన అన్ని రకాల నిర్ణయాలు తీసుకున్నారు. రుణమాఫీ, గిట్టుబాటు ధర, పంటలకు బీమాపై బిఆర్ఎస్ అనేక చర్యలు తీసుకోగా ఇప్పుడు ప్రచారాలతో కాంగ్రెస్ కాలం గడుపుతోందని అన్నారు. పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తే రైతులు ఆత్మగౌరవంతో బతుకుతారని,కానీ కేంద్ర
రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని విస్మరించాయని అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు,
మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వారి సమస్యలను బిఆర్ఎస్ మాత్రమే పరిష్కరిస్తుందిన అన్నారు.

# మద్య నియంత్రణతోనే నేరాలకు అడ్డుకట్ట!

భారీగా మద్యం అమ్మకాలు సాగాలన్నదే ప్రభుత్వాల లక్ష్యంగా ఉంది. మద్యంతో ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో ప్రభుత్వాలు గమనించడం లేదు. మద్యం ఆదాయంతో కిలో రూపయి బియ్యం, పెన్షన్లు ఇవ్వడానికి, ఉచి పథకాలకు ప్రభుత్వాలు అలవాటు పడ్డాయి. అందుకే మద్యనిషేధాన్ని అమలు చేయడం లేదు. తాగి చచ్చినా ఫర్వాలేదు... మద్యం అమ్మకాలు సాగాలి.. ఆదాయం పెరగాలన్న ధోరణిలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలు ఇందుకు భిన్నంగా లేవు. నిజానికి ఉచిత పథకాలు ఆపితే మద్యం అమ్మకాల వైపుచూడాల్సి రాదు. తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలపై అదుపు లేకుండా పోతోంది. మద్యం ధరలు పెంచినా అమ్మకాలు ఆగడం లేదు. మద్యం ప్రధాన ఆదాయ వనరు కావడంతో తెలుగు రాష్ట్రాల్లో అమ్మకాలపై అజమాయిషీ లేకుండా పోతోంది. బ్రాండ్ ఏదైనా డబ్బులు తెచ్చి పెడుతోంది. మద్యం, గంజాయి వంటివి అందుబాటులో ఉండడంతో జులాయిలు అకృత్యాలకు తెగబడుతున్నారు. మత్తులో ఉన్న వారిలో దూకుడు స్వభావం, విపరీత ధోరణి ఉంటుంది. ఇదే నేరాలకు దారి తీస్తోంది.విపరీత ప్రవర్తన, సమాజంపై ద్వేష భావం ఉండేవారికి మద్యం మత్తు తోడైతే అది తీవ్రమైన నేరాలకు కారణమవుతుంది. అందువల్ల మద్యం,గంజాయి లభ్యం కాకుండా అరికట్టే మార్గాలు ఆలోచించాలి. అకృత్యాల కట్టడికి ఏం చేయాలన్నది చర్చించాలి. మహిళలపై లైంగిక నేరాలు, అత్యాచారాలకు పాల్పడు తున్న వారిలో మద్యం మత్తులో ఉన్నవారెందరన్నది గణాంకాలు తీయాలి. అలాగే ఎక్కడపడితే అక్కడ మద్యం లభిస్తోంది. దీనికి తోడు గంజాయి లభ్యత కూడా పెరిగింది. చెడు సావాసాలతో మత్తులో మునిగి నేరాలకు పాల్పడుతున్నారు. దీనికంతటకీ నిరుద్యోగం, పనులు లేకపోవడం కూడా కారణంగా చూడాలి. ఇవన్నీ అరికట్టేందుకు ఏం చూయాలో ఆలోచించి ముందుకు కదిలితేనే నేరాలను అరికట్టగలం. ఇటీవల గంజాయి కూడా విపరీతంగా పట్టుబడుతోంది. ఎంతగా స్వాధీనం చేసుకున్నా రవాణా ఆగడం లేదు. దీనికి కారణం మార్కెట్లో డిమాండ్ కారణంగా గంజాయి పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎపితో పోలిస్తే తెలంగాణలో మద్యం అమ్మకాలు పెరిగాయి. మద్యం అమ్మకాలతో పాటు నేరాలు, ఘోరాలు కూడా పెరుగుతున్నాయి. మద్యం మత్తులోనే నేరాలు జరుగుతున్నట్లు పోలీసులు కూడా అంగీకరిస్తున్నారు. అత్యాచారలు, దొంగతనాలు, కిడ్నాప్‌లు ఇలా అనేక రకాలైన నేరాలకు మద్యం కారణం అవుతోంది. సంపూర్ణ మద్యనిషేధం విధిస్తామని అధికారంలోకి వచ్చినప్పుడు నాటి సిఎం జగన్ హామీ ఇచ్చి డొల్ల కంపెనీల బ్రాండ్లతో వేలకోట్లు సంపాదించారు. మద్యం కుంభకోణంపై ఇప్పుడు సిట్ విచారణ సాగుతోంది. మద్యం అమ్మకాలు లేకపోతే ప్రభుత్వం నడిచే పరిస్థితిలో లేదు. దీంతో మద్యం అమ్మకాలను బాహాటంగానే ప్రోత్సహిస్తున్నారు. ఇష్టం వచ్చిన బ్రాండ్లతో అమ్మకాలు చేసి ఖజానా నింపుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడా..ఇక్కడా అన్న తేడా లేకుండా నేరాలు పెరుగుతున్నాయి. అంతెందుకు పార్టీ కార్యకర్తలకు మందు లేనిదే కాలు బయట పెట్టడం లేదు. పార్టీ ఏదైనా.. కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనాల్లో మద్యంతోపాటు ముక్క లేనిదే కదలడం లేదు. అత్యాచార ఘటనల్లో అనేకం కేవలం మద్యం కారణంగానే జరిగినట్లుగా గుర్తించారు. రేపిస్టులకు కఠిన శిక్షలు పడితే ఇలాంటి దారుణాలు చోటుచేసుకోవు. ప్రభుత్వం తాము కఠినంగా ఉన్నామని అనుకుంటే సరిపోదు. కఠినంగా ఉంటున్నారన్న సందేశం ప్రజల్లోకి వెళ్లగలిగేలా చేయాలి. అప్పుడే ఇలాంటి ఘటనలు జరగవు. అలా చేయాలనుకున్న వారు కూడా జంకుతారు.అక్రమాలు, అకృత్యాలపై ప్రభుత్వాలు ఉదాసీనంగా ఉండడం వల్లనే దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. అవి ఒక్క ఎపిలోనే జరుగు
తున్నాయని చెప్పడానికి లేదు. తెలంగాణతో పాటు ఘనత వహించిన యూపిలో కూడా జరుగుతూనే ఉన్నాయి. గొప్పలుచెప్పుకుంటున్న కమ్యూనిస్టుల ఏలుబడిలో ఉన్న కేరళలోనూ జరుగుతున్నాయి. రాక్షసులకు ప్రాంతం ఏదన్నది ముఖ్యం కాదు. రాక్షస ప్రవృత్తి ఉన్నవారు ప్రపంచమంతా నిండి ఉన్నారు. అలాంటి వారికి మద్యం తోడవుతోంది. వారికి కఠిన శిక్షలు అమలు చేయాల్సి ఉంది. ఏదైనా అరాచక సంఘటన జరిగినప్పుడు ఉమ్మడిగా ఎలా ముందుకు వెళ్లాలన్న ఆలోచనచేయాలి. ఇకపోతే ఇటీవల చోటు చేసుకుంటున్న సామూహిక అత్యాచార ఘటనలను చూస్తే సామాన్యలకు కూడా భయమేస్తోంది. బయటకు రావాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఉంది. చిన్నపిల్లలను కూడా వదలడం లేదు. కొన్ని సందర్భాల్లో న్యాయస్థానాలు కఠిన శిక్షలు విధించి కొంత ఊరటను కలిగిస్తున్నాయి. ఇలాంటి ఘటనలన్నింటికి మద్యపానం, మాదక ద్రవ్యాల వాడకం అన్నది ప్రధాన కారణమవుతోంది. పోలీసలు దర్యాప్తుల్లో ఇదే తేలుతోంది. ఆయా ఘటనల్లో నిందితులు పూటుగా మద్యం సేవించి.. ఆ మైకంలో ఉచ్చనీచాలు మరచి దుశ్చర్యలకు తెగబడుతున్నారు. మద్యం, గంజాయి విచ్చల విడిగా లభిస్తుండటంతో ఆ మైకంలో పైశాచికత్వానికి ఒడిగడుతున్నారు. అత్యాచార ఘటనల్లో అరెస్టవుతున్న నిందితుల్లో 60 శాతం మంది వరకూ మద్యం మత్తులో ఉన్నప్పుడే ఆ పైశాచిక చర్యకు పాల్పడుతున్నట్లు వెల్లడవుతోంది. మద్యం విచ్చలవిడిగా అమ్మడం,మాదక ద్రవ్యాల విషయంలో కఠిన చర్యలు తీసుకోక పోవడం వల్ల ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో పాలకులు గుర్తించాలి. మత్తులో పేట్రేగుతున్న ఉన్మాదులు..వరుసగా సామూహిక అత్యా చార ఘటనలకు పాల్పడుతున్న తీరును ఎలా ఎదుర్కోవాలన్న ఆలోచన చేయాలి. అత్యాచార ఘటనల నిరోధానికి ఉమ్మడిగా పోరాడాలి. దీనికి ఫలానా వారు ప్రభుత్వంలో ఉన్నారు కనుక వారే బాధ్యులని నిందించలేం. ఎందుకంటే వారు చేసే అకృత్యాలకు అధికారపార్టీ వారు లైసెన్స్ ఇవ్వలేదు. వారు మద్యం మత్తులో చేసే ఘటనలు కనుక మద్యం అమ్మకాలపై ఆలోచన చేయాలి. ఇలాంటి ఘటనల్లో దోషులకు కఠిన శిక్షలు వేసేలా చేయాలి. మత్తులో ఉన్నవారికి విచక్షణ ఉండదు. తమ చర్యలపై నియంత్రణ ఉండదు. పశువాంఛ బయటపడే క్రమంలో అమానుష చర్యలకు తెగబడుతుంటారు. అలాంటి సందర్భాల్లో బాధితులు ఎవరైనా వారిని ఎదిరించినా, వారి నుంచి తప్పించుకోవటానికి ప్రయత్నించినా మరింత రెచ్చిపోతారు. హింసాత్మక చర్యలకు దిగుతారు. వీటిని మానసిక నిపుణులు కూడా అంగీకరిస్తున్నారు.